ముగిసిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు

బెల్లంపల్లి, జూలై 21 : బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామంలో ఆదిలాబాద్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆర్డీవో హరిప్రసాద్ హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 33 జిల్లాల నుంచి 740 మంది క్రీడాకారులు, 100 మంది కోచ్‌లు పాల్గొన్నారు. అండర్-18, 21, 22 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు జార్ఖండ్ రాష్ట్రంలో ఈ నెల 27 నుంచి 31 వరకు జరిగే జాతీయస్థాయిలో పాల్గొననున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

సీసీసీ నస్పూర్, జూలై 21 : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆరోపించారు. నస్పూర్ నర్సయ్య భవన్‌లో ఆదివారం సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు దాటిపోయినా ఇచ్చిన హామీలు అమలు కావడంలేదన్నారు. నస్పూర్‌లో ఆగస్టు 4న సీపీఐ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఉంటుందని తెలిపారు. నూతన శాఖలు పునరుద్ధరించుకొని స్థానిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలోని 25 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 10న మంచిర్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో సీపీఐ జిల్లా నిర్మాణ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు లింగం రవి, జోగుల మల్లయ్య, మేకల దాసు, కారుకూరి నగేశ్, రేగుంట చంద్రశేఖర్, మిర్యాల రాజేశ్వర్‌రావు, కొట్టె కిషన్‌రావు, మొగిలి లక్ష్మణ్, మర్రి సందీప్, ఆల్ల లచ్చిరెడ్డి, బొడ్డు లచ్చన్న, సంఘం సదానందం, తోట మహేశ్, బాకం శంకర్, అచ్చే హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 21 : ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో పని చేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్ ఖన్నా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టీ దివాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా జాతీయ ఆరోగ్య మిషన్ కింద పని చేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించలేదన్నారు. అనంతరం ఎన్‌హెచ్‌ఎం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బోగే ఉపేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్లుగా జీ వినోద్, షకీల్, ఉపాధ్యక్షులుగా చిరంజీవి, గోపి, కృష్ణ, చంద్రకళ, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ముస్తాక్, శ్రీదేవి, సాయిలత, కోశాధికారిగా సంగీతను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్, రాష్ట్ర నాయకులు లత తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు

సీసీసీ నస్పూర్, జూలై 21 : సీసీసీ నస్పూర్‌లో ఆషాఢ మాసం పోచమ్మ బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. నస్పూర్‌కాలనీ పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు బోనాలతో తరలివచ్చారు. ఇక్కడి నుంచి నస్పూర్‌కాలనీ పోచమ్మ ఆలయం వరకు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కౌన్సిలర్ అగల్‌డ్యూటీ రాజు, పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు సందుపట్ల శ్రీనివాస్, పెంచాల వేణు, పస్పునూటి కుమార్, సిరంగి శ్రీధర్, స్టంట్ కిరణ్, ఏలేటి కార్తీక్‌రెడ్డి, బద్రి శ్రావణ్, పెంచాల శ్రీనివాస్, రఘుపతిరావు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

జైపూర్, జులై 21: మండలకేంద్రంతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల్లో బోనాలు నిర్వహించారు. ఆషాఢ మాసం ముగుస్తుండడంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

పీఈటీకి నివాళి..

బెల్లంపల్లి, జూలై 21 : పట్టణంలోని ఒకటో వార్డు, కన్నాల బస్తీ మధుననగర్‌కు చెందిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు మిట్టపల్లి రమేశ్ మృతదేహం వద్ద తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ పూలమాల వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట పట్టణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : బారెగూడలో రోడ్డుపై నాటు వేస్తున్న గ్రామస్తులు

మందమర్రి : ఇందుకాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

కోటపల్లి : కోతకు గురైన ఎసన్వాయి రోడ్డు

ముసురేసింది

- మూడురోజులుగా వదలని వాన
- నిండుగా ప్రవహిస్తున్న కుంటలు, వాగులు, ఒర్రెలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల వ్యాప్తంగా మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కుంటలు, వాగులు, ఒర్రెలు వరదనీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. చాలా చోట్ల రోడ్లన్నీ బురదమయమయ్యాయి. ఎడతెరపి లేని వర్షానికి ప్రజలకు బయటకు రాకపోగా వాగులు ఉప్పొంగడంతో కొన్ని గ్రామాలు జలదిబ్బంధంలో ఉండిపోయాయి. అధికార యంత్రాంగం ప్రజలకు పలు సూచనలు జారీ చేస్తున్నది. అవసరమైతేనే బయటకు రావాలని, జాగ్రత్తలు పాటించాలని సూచించింది. - ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్/తాండూర్/వేమపల్లి/చింతలమానేపల్లి/మంచిర్యాలటౌన్/పెంచికల్‌పేట్/కోటపల్లి/మందమర్రి/కౌటాల/కాసిపేట/సిర్పూర్(టీ)/శ్రీరాంపూర్, జూలై 21

- ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 21 : ఆదివారం జిల్లా వ్యాప్తంగా 63.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. జైనూర్‌లో 85.4, సిర్పూర్ (యూ)లో 75.2, లింగాపూర్‌లో 108.2, తిర్యాణిలో 55.0, రెబ్బెనలో 42.4, ఆసిఫాబాద్‌లో 81.0, కెరమెరిలో 59.8, వాంకిడిలో 72.2, కాగజ్‌నగర్‌లో 26.6, సిర్పూర్(టీ)లో 34.2, కౌటాలలో 61.2, చింతలమానేపల్లిలో 74.8, బెజ్జూర్‌లో 56.4, పెంచికల్‌పేట్‌లో 62.6, దహెగాంలో 54.4 మి.మీ నమోదైంది. ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలోని కుమ్రం భీం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 3,258 క్యూసెక్కుల నీరు వస్తున్నది. దీంతో అధికారులు 4, 5, 6వ నంబర్ గేట్లను 0.50 మీటర్ల మేర ఎత్తి, అంతే మోతాదులో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.
- మంచిర్యాల జిల్లా కేంద్రానికి సమీపంలోని క్వారీలో జరిగిన జాతరలో వర్షం కారణంగా జనాలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మరోవైపు అవసరముంటే తప్ప ప్రజలు బయటకు రావద్దని పోలీసులు సూచిస్తున్నారు.
- తాండూర్ మండల కేంద్రంతో పాటు, పల్లెల్లో వీధులన్నీ చిత్తడిగా మారాయి. ఉపాధి కూలీల పనులు నిలిచిపోయాయి. వివిధ పనులకు వెళ్లే వారికి ఆటంకం కలిగింది. మరో 2, 3 రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని వెబెక్స్ ద్వారా కలెక్టర్ ఆదేశించారు. అనుమతి లేకుండా సెలవులు తీసుకోవద్దని, విధులు నిర్వర్తించే ప్రాంతం నుంచి వెళ్లొద్దని స్పష్టంచేశారు.
- వేమనపల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ సూచించారు. ముల్కలపేట నుంచి రాచర్ల వెళ్లే మార్గంలో కొత్తగా నిర్మించిన హై లెవెల్ వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు కుంగిపోయి, నెర్రెలువారింది. ప్రమాదకరంగా మారడంతో ఈ మార్గాన్ని మూసివేశారు. రాచర్ల, వెంచపల్లి, సూపాక, జనగామ, ఆలుగామ గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయిందన్నారు. సమస్యలుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు.

కాసిపేట : కూలిన ఇల్లు వద్ద బాధితులు

- చింతలమానేపల్లి మండలం బాబాసాగర్‌లోని అర్కగూడ ప్రాజెక్టు నిండి, మత్తడి దుంకుతున్నది. దీంతో నాయికపు గూడకు రాకపోకలు నిలిచిపోయాయి. దిందా-కేతిని వాగు ఉప్పొంగడంతో మూడోరోజు దిందా ప్రజలు జలదిగ్బంధంలో ఉన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై చేరింది. ప్రజలను అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. డబ్బా జీపీ పరిధి బారెగూడ గ్రామస్తులు.. తమ కాలనీలోని బురద రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. సైడ్ డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లపై నీరు నిలిచి, బురదమయంగా తయారవుతున్నాయన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు విలాస్, బాపురావు, నికోడె శ్రీనివాస్, విలాస్, టాకిరె వగు, చౌదరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.
- పెంచికల్‌పేట్ మండలంలోని పెద్దవాగు, ఉచ్చమల్లి వాగు, బొక్కివాగు మత్తళ్లు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో పంట చేలు నీటమునిగాయి. అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కొండపల్లిలో గొల్లవాగుపై శిథిలావస్థలో ఉన్న లోలెవల్ వంతెనలో పూజారి హనుమంతుకు చెందిన కోడె ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. గొల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా, అటుగా మేతకు వెళ్లిన కోడె వంతెనలో ఇరుక్కుపోయింది. యువకుడు పల్లెం పురుషోత్తం, పలువురు యువకులు బయటకు తీసినా, అప్పటికే చనిపోయింది. దాని విలువ రూ.30 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని హనుమంతుకు వేడుకున్నాడు.
- కోటపల్లి మండలంలోని ఎసన్వాయి గ్రామానికి వెళ్లే రోడ్డు కోతకు గురైంది. వరద తాకిడికి తెగిపోయే స్థితిని వచ్చింది. ప్రస్తుతం ఈ మార్గంలో బైకుల ద్వారానే ప్రయాణించాల్సి వస్తున్నది. సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. నక్కలపల్లి గ్రామానికి వెళ్లేదారిలో గల లోలెవల్ వంతెన కొట్టుకుపోగా, గ్రామ యువకులు శ్రమదానం చేసి, రాకపోకలు సాగేలా చేశారు. వాగుమొత్తం బండలతో నిండిపోయి నడక కూడా సాధ్యం కాకపోతుండడంతో గ్రామస్తులు ఈ నిర్ణయం తీసుకున్నారు.
- మందమర్రి పట్టణంలోని రోడ్లన్నీ బురదమయమయ్యాయి. మార్కెట్, పాతబస్టాండ్, యాపల్, అంగడిబజార్, పాలచెట్టు, ప్రాణహిత కాలనీ ఏరియాల్లోని రోడ్లపై గుంతల్లో నీరుచేరడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. నార్లాపూర్ సమీపంలోని ఇందు గార్డెన్ కాలనీలో రోడ్లపై నీరు నిలవడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. మున్సిపల్ అధికారులు తమ ఇబ్బందులను గ్రహించి, డ్రైనేజీలను నిర్మించాలని కాలనీవాసులు కోరారు. వర్షాల నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు మందమర్రి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఏ ప్రమాదం వాటిల్లినా, కాలనీల్లో పెద్ద ఎత్తున నీరు నిలచినా వెంటనే హెల్ప్‌డెస్క్ 1800425 3611, ల్యాండ్‌లైన్ 08736293611 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. వెంటనే తమ సిబ్బంది వచ్చి సహాయసహకారాలు అందిస్తారని తెలిపారు.
- కౌటాల మండలంలోని చెరువులు, కుంటలు, వాగులు, ఒర్రెల్లో వరద చేరి నిండుగా ప్రవహిస్తున్నాయి. మండల సరిహద్దు వార్దా, ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత ఒడ్డున గల పుష్కర ఘాట్ మెట్లు మొత్తం మునిగిపోయాయి. అలాగే తాటిపల్లి వద్ద వార్దా నదిలో వరద నీరు చేరి, నిండుగా ప్రవహిస్తుండంతో సమీపంలోని పంట చేనుల్లోకి నీరు చేరుతున్నది.
- కాసిపేట మండలం దుబ్బగూడెంకు చెందిన దుర్గమ్మ ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. తన బిడ్డ, ఇద్దరు మనుమళ్లతో ఉంటుండగా, వర్షానికి తడిసి కూలిపోయింది. ఆ సమయంలో వారు పక్క గదిలో ఉండడంతో ప్రమాదం తప్పింది.
- సిర్పూర్(టీ) మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సిర్పూర్(టీ)-చీలపల్లి గ్రామాలకు వెళ్లే దారిలో కల్వర్టు, చిన్నమాలిని వద్ద లోలెవల్ వంతెనలు వరద దాటికి కొట్టుకుపోయాయి. దీంతో చీలపల్లి, మేడిపల్లి, మాలిని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని సిర్పూర్(టీ)-వెంకట్రావ్‌పేట్ అంతర్రాష్ట్ర వంతెన వద్ద పెన్‌గంగా ఉధృతంగా ప్రవహిస్తున్నది. పెన్‌గంగ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణతో కలసి హుడ్కులీ లోలెవల్ వంతెన, వెంకట్రావ్‌పేట్ అంతర్రాష్ట్ర వంతెనను పరిశీలించారు.
- సింగరేణిలోని 20 ఓసీపీల్లో ఉత్పత్తి, ప్రైవేట్ కాంట్రాక్టు సంస్థలకు అప్పగించిన మట్టి తవ్వకాలు, రవాణా పూర్తిగా నిలిచిపోయాయి. శ్రీరాంపూర్ ఓసీపీలో రోజుకు 9 వేల టన్నులు, ఇందారం ఓసీపీలో 3,500 టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగుతున్నది. ఏరియాలో 5 రోజుల్లో రూ.4.5 కోట్లు నష్టం వాటిల్లింది. ఓసీపీలో వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నది. యాజమాన్యం మోట్లా సాయంతో ఎప్పటికప్పుడు నీటిని ఉపరితలానికి తరలిస్తున్నది. వర్షాకాలం ప్రభావం చూపకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్పినప్పటికీ, ఫలితాలివ్వలేదని పలువురు అంటున్నారు. ఈ వర్షంతో ఓసీపీల్లో కార్మికులు యంత్రాల మెయింటనెన్స్, ఉపరితలంలోని బంకర్లను రిపేర్ చేస్తున్నారు.

సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించండి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 21 : తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయడంతో పాటు సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగుల జిల్లా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కోవ లక్ష్మి వినతి పత్రం అందజేశారు. ఆదివారం ఆసిఫాబాద్‌లో ఆమెను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. వారు మాట్లాడుతూ గతేడాది వరంగల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించి అధికారంలోకి వస్తే ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల కమిటీ జిల్లా అధికార ప్రతినిధి గెడేకార్ సంతోష్‌కుమార్, కోశాధికారి నగేశ్, తిరుపతి, రాము, సుభాష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

దండేపల్లి, జూలై 21 : మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ దళిత మహిళ కాబట్టే ఆరోపణల పేరుతో స్థానిక పాఠశాల స్టాఫ్‌తో ఎంఈవో కుమ్మక్కై, సస్పెండ్ చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తప్పుడు విచారణలు చేసి, సస్పెండ్ చేయించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తగరపు సత్యం పాల్గొన్నారు.

నూతన భవనం ప్రారంభం

వాంకిడి, జూలై 21: బైత్వాన్ బుద్ధ విహార్ ప్రవచన నూతన భవనాన్ని ఆదివారం వాంకిడి మండల కేంద్రంలో భారతీయ బౌద్ధ విహార్ జిల్లా అధ్యక్షుడు మోహుల్కార్ అశోక్, మండలాధ్యక్షుడు జయరామ్ మండల అంబేద్కర్ యువజన సంఘం నాయకులతో కలసి ప్రారంభించారు. ఇక్కడ అంబేద్కర్ యువజన సంఘం మండల ఉపాధ్యక్షుడు దుర్గం సునీల్, కార్యదర్శులు రోషన్, విలాస్, బౌద్ధ సమాజ అధ్యక్షుడు విజ య్, దుర్గం శ్యామ్‌రావు, వర్శవాస్ కమిటీ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, ఉపాధ్యక్షుడు దీక్షిత్ దుర్గం, బౌద్ధ ఉపాసకుడు పాండిజి జాడే, అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామారావ్ మహరాజ్ జయంతి

కెరమెరి, జూలై 21 : మండలంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూపలాల్ నాయక్ ఆధ్వర్యంలో బంజారాల ధర్మ గురువు సంత్ తపస్వి రామారావ్ మహరాజ్ 89వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాథోడ్ శంకర్ నాయక్, నాయకులు రాథోడ్ ఉత్తమ్ నాయక్, బానోత్ వెంకట్ నాయక్, ధారవత్ లాలూ, జాటోత్ తిరుపతి, జాటోత్ దేవాజీ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ కోయ గోండి భాషాదినోత్సవం

జైనూర్, జూలై 21 : మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో కోయ (గోండి) భాషా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల ఐకాస రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనకయాదవరావ్, ఆదివాసీ సంఘాల జిల్లా ప్రతినిధి ఆత్రం భీంరావ్‌తో కలిసి కోయ (గోండి)భాషాదినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మండాడి సోనేరావు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

సిర్పూర్(యు) జూలై 21 : మండలంలోని పంగిడి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గెడం మారుతి అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. ఆయన మృతిపై కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

నూతన భవనాన్ని నిర్మించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 21: జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహానికి నూతన భవనాన్ని నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని ఆదివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వసతి గృహాల సమస్యల పరిష్కారానికి కేవీపీఎస్ పోరాటం చేస్తోందని పేర్కొన్నారు.

కలప పట్టివేత

కోటపల్లి, జూలై 21 : ప్రాణహిత గుండా అక్రమ తెప్పల రూపంలో తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు కోటపల్లి రేంజర్ రవి ఆదివారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు పరీవాహక ప్రాంతాల్లో నిఘా పెట్టగా, 20 టేకు దుంగలు లభించినట్లు వివరించారు. వాటి విలువ రూ.3.7లక్షల వరకు ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు డీ రవీందర్, లక్ష్మణ్, ఎండీ నదీమొద్దీన్, సత్యనారాయణ, నరేశ్, బేస్ క్యాంప్ సిబ్బంది జింజిరి శ్రీనివాస్, సంపత్, అశోక్, సాగర్, నవాజ్, చిరంజీవి పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

కోటపల్లి, జూలై 21 : రైతు బీమాకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోటపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి మహేందర్ సూచించారు. 28 జూన్ 2024 వరకు పట్టాపాస్ బుక్ వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 18 నుంచి 59 ఏండ్లలోపువారు అర్హులని, దరఖాస్తు ఫారంతో పాటు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఏఈవోలకు ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భైరవ దేవుడికి పూజలు

కోటపల్లి, జూలై 21 : కోటపల్లి మండలం పారుపల్లి సమీపంలోని భైరవ కోనపై వెలసిన భైరవుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటపల్లి మండలంతో పాటు, చుట్టు పక్కల మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. కోటపల్లి మండల కేంద్రానికి చెందిన చింత సౌజన్య-సంపత్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

అడ్ హక్ కమిటీ ఎన్నిక

బెల్లంపల్లి, జూలై 21 : స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన దళిత సంఘాల ఐక్యవేదిక సర్వసభ్య సమావేశంలో అడ్ హక్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాత కమిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సభ్యులుగా డీఆర్ శ్రీధర్, గొడిసెల శ్రీహరి, కుంభాల రాజేశ్, దుర్గం గోపాల్, రత్నం ఐలయ్య, బుర్సా గోపాల్‌ను ఎన్నుకున్నారు. 34వార్డుల దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మా ప్రిన్సిపాల్ బదిలీ ఆపాలి

- మంచిర్యాల ఎమ్మెల్యేను కలిసిన లక్షెట్టిపేట మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న విద్యార్థులు

లక్షెట్టిపేట, జూలై 21 : 'మా కళాశాల ప్రిన్సిపాల్ బదిలీని అపండి సార్..' అంటూ లక్షెట్టిపేట మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును తన ఇంటికి వెళ్లి, వేడుకున్నారు. ఈ విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా ఆరేళ్లుగా ఈ కళాశాలలో పనిచేస్తున్నారు. ఇటీవల బదిలీ అయ్యారు. విషయం తెలుసుకున్న విద్యార్థులంతా ఒక్కటై తమ ప్రిన్సిపాల్ తమకే ఉండాలని కోరుతూ ఆదివారం మంచిర్యాలలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావును కలిసి కోరారు. కళాశాల ప్రారంభించిన సమయంలో కేవలం 45 మంది విద్యార్థులే ఉండేవారని, అలాంటి కళాశాలలో ప్రస్తుతం 1250 మందికిపైగా ఉన్నారని, రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలగా పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయకండి అంటూ వేడుకున్నారు. అలాగే డిగ్రీ కళాశాలను పీజీకి అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, పట్టుబట్టి ఇంటిగ్రేడ్ బీఈడీ కోర్సు తీసుకువచ్చారని వివరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి, బదిలీని నిలిపేసే ప్రయత్నం చేస్తానని చెప్పారు. దీంతో విద్యార్థులంతా సంతోషంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు.

నీరు పోయేదెలా?

నాలాలో పేరుకుపోయిన ప్లాస్టిక్

తాండూర్, జూలై 21 : ప్లాస్టిక్ వాడొద్దని అధికారులు ఎంత మొత్తుకున్నా జనాలు వినిపించుకోవడం లేదు. ఆ ప్లాస్టిక్ ఇప్పుడు వరద, నీటి ప్రవాహాలకు అడ్డుకట్టగా మారి ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో నీరు ఎటూ వెళ్లలేక దుర్గంధ భరితంగా మారి, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. తాండూర్ మండలం తంగళ్లపల్లి పల్లె ప్రకృతి వనం సమీపంలో నాలా మొత్తం ప్లాసిక్‌తో నిండిపోయింది. నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది.

ఘనంగా గురుపౌర్ణమి

దండేపల్లి : గూడెంలోని సాయిబాబా ఆలయంలో భక్తులు

మందమర్రి : సాయిబాబా ఆలయంలో..

చింతలమానేపల్లి : కర్జెల్లి ఓంకార ఆశ్రమంలో..

చెన్నూర్ టౌన్/లక్షెట్టిపేట/మంచిర్యాల అర్బన్/దండేపల్లి/శ్రీరాంపూర్/చింతలమానేపల్లి/మందమర్రి /కౌటాలజూలై 21 : జిల్లాలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చెన్నూర్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా, సమీపంలోని శ్రీ అభయ వీరాంజనేయ దేవాలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, వీరబ్రహ్మేంద్రస్వామి గురుపూజ